# భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన, నిత్యకల్యాణం

## వైభవంగా నిర్వహించిన అర్చకులు

**భద్రాచలం, జనవరి 10,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం ఆర్జిత సేవలలో భాగంగా స్వర్ణ తులసార్చనను ఘనంగా నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకరబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనాలను ఆలయ వైదిక సిబ్బంది శాస్త్రోక్తంగా నిర్వహించారు.




జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం





భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 11 | జనవరి | 2026 ◆ పేజీలు : 4






## మెరుగైన నైపుణ్యాలతోనే...

# యువతకు అవకాశాలు

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్


**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 10, ప్రజా జ్యోతి:** వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ పోతేనే యువత తమ భవిష్యత్తును అభివృద్ధి పథంలోకి తీసుకురాగలరని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు . శనివారం స్థానిక ఐ డి ఓ సి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో లెర్నెన్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే ఎంఆర్ఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఎన్ ఏ ఎఫ్ ఎస్ స్కీమ్ ద్వారా అప్రెంటిస్ షిప్ శిక్షణతో పాటు, రేన్ (మద్రాస్) లిమిటెడ్ సంస్థ ద్వారా సిఎన్సి మిషన్లపై అప్రెంటిస్ షిప్ , బ్యాచిలర్ / డిప్లొమా ఇన్–వోకేషనల్ కోర్సుల్లో రెండు సంవత్సరాల శిక్షణ కోసం నిర్వహించిన ఓరియెంటేషన్ , సెలక్షన్ ప్రోగ్రామ్ కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, యువతకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నైపుణ్యాలు ఉంటేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, యువతలో స్కిల్ డెవలప్ మెంట్ పెంపొందించాలనే లక్ష్యంతోనే ఈ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు

మిగతా 2 లో...



# ప్రైవేట్ హాస్పిటల్స్_ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ ఓ

**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 10, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని శ్రీ గణేష్ నర్సింగ్ హోమ్, పద్మావతి స్కానింగ్ సెంటర్, శ్రీరక్ష హాస్పిటల్ , స్కానింగ్ సెంటర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం రాథోడ్ శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆయన హాస్పిటల్స్ లో, స్కానింగ్ సెంటర్లలో ని రికార్డులను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా స్కానింగ్లు చేసిన యెడల లింగ నిర్ధారణ నిషేధ చట్టం కింద శిక్ష అర్హులు అవుతారని అన్నారు, . కావున రిఫరల్ స్లిప్పు ఉన్నవారికి మాత్రమే స్కానింగ్లు చేయాలని సూచించారు, ఆసుపత్రిని లోని వార్డులను, ఆపరేషన్ థియేటర్లను ,రక్త పరీక్ష కేంద్రాలను కూడా సందర్శించి వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, హెచ్ ఓ భద్రు, పాల్గొన్నారు.



## భద్రాద్రిలో 23 నుంచి

# వాగ్గేయకారోత్సవాలు

- ఐదు రోజుల పాటు భక్తరామదాసు జయంత్యుత్సవాలు
- కరపత్రాలను ఆవిష్కరించిన దేవస్థానం ఈవో, ఏఈవోలు

**భద్రాచలం, జనవరి 10,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి ఐదు రోజుల పాటు

మిగతా 2 లో...



## రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై

# అధికారుల దాడులు

- -200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎన్ఫోర్స్మెంట్ అధికారులు
- -రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు తప్పవని హెచ్చరిక



**టేకులపల్లి, జనవరి10, ప్రజాజ్యోతి:** రాష్ట్రప్రభుత్వం పేద ప్రజలకు అందించే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. ఎక్కడైనా అక్రమ రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం వస్తే రాష్ట్రస్థాయి ఎన్ఫోర్స్మెంట్

మిగతా 2 లో...

# రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై అధికారుల దాడులు



(మొదటి పేజీ తరువాయి...)
అధికారులు బియ్యం నిల్వ ఉంచిన ప్రాంతానికి చేరుకొని మెరుపు దాడులు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగానే మండలంలోని దాసు తండ గ్రామ పంచాయతీ మంగళ్ తండా గ్రామం పాయం గుంపులో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 400 ల బస్తాలు, సుమారుగా 200 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం ఎన్ఫోర్స్మెంట్ ఏఎస్ఐ జి.వెంకటరమణ, సివిల్ సప్లై ఆర్ఐ నిక్కిలి వెంకటేశ్వర్లు, సిబ్బంది కలిసి దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచడంతో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి, రేషన్ బియ్యాన్ని తరలించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. రేషన్ బియ్యం ఎవరిది అనేది తెలియాల్సి ఉందని, పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నామని తెలిపారు. ఎవరైనా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన, అక్రమంగా కొనుగోలు చేసిన, రవాణా చేసిన వాటి సమాచారాన్ని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఇన్ఫోర్స్మెంట్ అధికారులు తెలిపారు.

## మెరుగైన నైపుణ్యాలతోనే...

# యువతకు అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి...)
చేసినట్లు తెలిపారు. ఈ అప్రెంటిస్ షిప్ శిక్షణలో ఉచిత శిక్షణతో పాటు స్టైపెండ్ సౌకర్యం, 100 శాతం ప్లేస్ మెంట్ సపోర్ట్ అందిస్తున్నట్లు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మల్టీ స్కిల్స్ అవసరమని, యువత నిరంతరం నేర్చుకునే దృక్పథాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. యువత తమ లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి అనుభవాలను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. తాను పేద కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగానని తెలిపారు. తన తండ్రి ఐటీఐ చదివారని, కుటుంబంలో పెద్దగా చదువుకున్న వారు ఎవరూ లేరని అన్నారు. తాను ఈ స్థితికి చేరుకోవడానికి ఎన్నో పనులు చేశానని, ఎంతో కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఉంటాయని, వాటికి భయపడి ఒకేచోట కూర్చుంటే విజయం దక్కదని అన్నారు. కష్టాలను అధిగమించి ఓర్పుతో ముందుకు వెళ్లిన వారే విజయతీరానికి చేరుకుంటారని పేర్కొన్నారు.



ఈ అప్రెంటిస్ షిప్ లో మంచిగా శిక్షణ తీసుకొని, యువత ఉద్యోగాలను సాధించి జిల్లాకు, తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సెలక్షన్ ప్రోగ్రామ్ కు హాజరుకాలేక పోయిన అభ్యర్థుల కోసం జనవరి 21న మరోసారి ట్రైనింగ్ , సెలక్షన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సెలక్షన్ లో ఎంపిక కాలేక పోయినా అభ్యర్థులు నిరాశ చెందకుండా, మరింతగా ప్రిపేర్ అయి భవిష్యత్తులో ఇంకా మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 107 మంది యువకులు హాజరుకాగా, వీరిలో 92 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించి, వారిలో 57 మందిని వివిధ ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఇందులో ఎమ్మార్ఎఫ్ఎల్ టిడి కంపెనీకి 39 మంది, రానే మద్రాస్ కంపెనీ లిమిటెడ్ కంపెనీకి 14 మంది, ట్రైనింగ్ కంపెనీకి 4 మంది యువకులు ఎంపికయ్యారని తెలిపారు. ఎంఆర్ఎఫ్ శిక్షణ కాలంలో మొదటి సంవత్సరంలో నెలకు రూ.17,500, రెండో సంవత్సరంలో రూ.18,500, మూడో సంవత్సరంలో రూ.19,500 స్టైపెండ్ అందజేయబడుతుందని తెలిపారు. ఇందులో వసతి సౌకర్యం కోసం రూ.1,000, క్యాంటీన్ సదుపాయం కోసం రూ.350, బస్ సౌకర్యం కోసం రూ.500గా మొత్తం రూ.1,850 మినహాయించి మిగిలిన మొత్తాన్ని స్టైపెండ్ రూపంలో యువతకు చెల్లించబడుతుందని వివరించారు. రానే (మద్రాస్) కంపెనీ వారు శిక్షణ కాలంలో మొదటి సంవత్సరంలో నెలకు రూ.15,200, రెండో సంవత్సరంలో రూ.16,200 స్టైపెండ్ అందజేస్తారని, శిక్షణ పూర్తయిన అనంతరం ఎంపికైన యువతకు ప్రారంభ జీతంగా నెలకు రూ.22,000 చెల్లించబడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ ఎఫ్ కంపెనీ సూపర్ వైజర్ అమృత్ రాజు, రానే మద్రాస్ కంపెనీ నుండి రిక్రూట్ మెంట్ – అసిస్టెంట్ మేనేజర్ బిస్వజిట్ ఖుంటియా, ఎస్ ఆర్ ఈ పి నుండి బి.నీలయ్య, ఏపిఎం లు ఎల్.వెంకయ్య, జి. ప్రసాద్ రెడ్డి, ఏ. నాగేశ్వర రావు, ఈ.డి.యం కలెక్టరేట్ టెక్నికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం




**కొత్తగూడెం సింగరేణి, జనవరి 10 – ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ డి.కృష్ణ భాస్కర్, డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు ఆదేశాల మేరకు, సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ సూచనల మేరకు సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం లో భాగముగా వారి కోసం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చెవి, ముక్కు మరియు గొంతు సమస్యలు గల వారి కొరకు మా ఈఎన్‌టి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, హైద్రాబాద్ వారిచే శనివారం సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు ప్రత్యేక మెగా ఈఎన్‌టి, నవజాత శిశువుల వినికిడి పరీక్షా వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏసిఎంఓ ఎం.ఉష హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సంధర్భముగా ఏసిఎంఓ ఎం.ఉష మాట్లాడుతూ... సింగరేణి సంస్థ కార్మికుల, ఉద్యోగుల సంక్షేమం విషయములో ముందు వరుసలో ఉంటుంది అని సింగరేణి లో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులకు సూపర్ స్పెషాలిటీ వైధ్యం అందించాలనే ఉద్దేశం తో ఉద్యోగులు హైద్రాబాద్ కు వెళ్ళే అవసరం లేకుండా వారి సౌలభ్యం కొరకు హైద్రాబాద్ లో గల అన్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వారిచే మన సింగరేణి ఆసుపత్రులలోనే వైద్యం అందిస్తున్నామని, అందులో భాగముగా ఈ రోజు మా ఈఎన్‌టి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే ప్రత్యేక మెగా ఈఎన్‌టి మరియు నవజాత శిశువుల వినికిడి పరీక్షా వైద్య శిబిరం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అదే విధముగా ప్రతీ రెండవ మరియు





నాలుగవ ఆదివారం నాడు సింగరేణి ప్రధాన ఆసుపత్రి లో సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను నిర్వహించుకుంటున్నామని, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, రిటైర్డ్ కార్మికులు మరియు వారి కుటుంబ సభ్యులు ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపులను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన మొత్తం 85 మందికి నిష్ణాతులైన మా ఈఎన్‌టి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సిబ్బంధి చే అధునాతన ఆడియోమెట్రి మరియు నియోనేటల్ స్క్రినింగ్ పరికరాలచే చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఏసిఎంఓ శ్రీమతి ఎం.ఉష, డివై.సిఎంఓ లు ఓ.కాళేశ్వర రావు, కే.ఎస్.విశ్వమేధి, ఈఎన్‌టి స్పెషలిస్ట్ శ్రీ ఎం.శశికిరణ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి. లలిత, మా ఈఎన్‌టి ఆసుపత్రి సిబ్బంది, మెయిన్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాద్రిలో 23 నుంచి వాగ్గేయకారోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి...)
భక్తరామదాసు 393వ జయంతి ఉత్సవాల్లో భాగంగా వాగ్గేయకారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలు జనవరి 23 నుంచి 27 వరకు దేవస్థానం, అలివేలుమంగా సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్, హరిహర కల్చరల్ ట్రస్ట్, నాదసురంగణి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా వాగ్గేయకారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) కె. దామోదర్ రావు, సహాయ కార్యనిర్వహణాధికారులు శ్రావణ్ కుమార్, భవానీరామకృష్ణలు ఆవిష్కరించారు. ఈ ఉత్సవాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ప్రముఖ సంగీత కళాకారులు పాల్గొని భక్తిరసభరిత సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్నారు. చక్ర సిమెంట్స్ అధినేత నేండ్రగంటి కృష్ణమోహన్ రామయ్య, రామదాసుపై అపార భక్తితో ప్రతి ఏడాది ఈ వాగ్గేయకారోత్సవాలను నిర్వహిస్తూ ఉత్సవాలకు విశేష శోభను చేకూరుస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి కళాకారులను ఆహ్వానించి భద్రాచలంలో సంగీత నీరాజనాలను సమర్పించేలా కృషి చేస్తున్నారు. ప్రతి ఏడాది వాగ్గేయకారోత్సవాల ప్రారంభ రోజున స్వయంగా హాజరై స్వామి వారి సేవలో పాల్గొంటారు. 'నవరత్న ఘోష్టి' పేరిట రామదాసు కీర్తనలను ఆలపించి స్వామి వారికి సంగీత నీరాజనం అర్పిస్తారు. ఈ ఉత్సవాల్లో మల్లాది సోదరుల సంగీత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

**కార్యక్రమాల వివరాలు ఇలా...**

ఉత్సవాల్లో తొలి రోజు అయిన జనవరి 23న నగర సంకీర్తన, భక్తరామదాసు విగ్రహానికి అభిషేకం, చిత్రకూట మండపంలో సభా ప్రారంభం, నవరత్నకీర్తనల ఘోష్టి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో నేండ్రగంటి కృష్ణమోహన్, మల్లాది సూరిబాబు, మల్లాది శ్రీరామకుమార్, రవికుమార్ తో పాటు ఇతర ప్రముఖ కళాకారులు పాల్గొని సంగీత ప్రదర్శనలు అందించనున్నారు. జనవరి 24 నుంచి 27 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వివిధ సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# బెదిరింపులకు పాల్పడుతున్న ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ!?

- కొత్తగూడెం ఏరియా స్టోర్‌లో గిరిజన ఉద్యోగిపై వేధింపులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఫిర్యాదు



**కొత్తగూడెం (సింగరేణి), జనవరి 9, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సింగరేణి ఏరియా స్టోర్‌లో గిరిజన ఉద్యోగిపై తీవ్ర వేధింపులు జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు ఈ నెల ఐదో తేదీన ఎస్సీ–ఎస్టీ లైజనింగ్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు సమాచారం. వివరాల్లోకి వెళ్తే, కొత్తగూడెం ఏరియా స్టోర్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నలకావత్ వెంకటేశ్వర్లు గత నాలుగేళ్లుగా అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. గిరిజన బంజారా వర్గానికి చెందిన ఆయన, గత కొన్నేళ్లుగా పక్షవాతం కారణంగా తీవ్ర శారీరక ఇబ్బందులతో బాధపడుతున్నారు. కుడి చేయి, కుడి కాలు పూర్తిగా పనిచేయని స్థితిలో ఉన్నప్పటికీ విధులు కొనసాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అదే ఏరియాలో పనిచేస్తున్న శ్రీనివాస్ అనే ఉద్యోగి, ప్రస్తుతం ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీగా వ్యవహరిస్తూ, తనను లక్ష్యంగా చేసుకుని మానసిక వేధింపులకు పాల్పడుతున్నాడని వెంకటేశ్వర్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్ ముప్పై తేదీన వెంకటేశ్వర్లు విధుల్లో ఉన్న సమయంలో విధులకు శ్రీనివాస్ అనే జూనియర్ అసిస్టెంట్ ఆలస్యంగా వచ్చి మస్టరు వెయ్యవలసిందిగా ఆదేశించగా ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. ఆ సమయంలో శ్రీనివాస్ దురుసుగా మాట్లాడుతూ బెదిరించాడని బాధితుడు ఆరోపించారు. అంతే కాదు, గత కొంతకాలంగా రోజూ విధులకు ఆలస్యంగా వచ్చి తనను భయభ్రాంతులకు గురిచేస్తూ, అవమానకరంగా మాట్లాడుతున్నాడని ఫిర్యాదులో వివరించారు. తన శారీరక పరిస్థితిని ఏమాత్రం పట్టించుకోకుండా ఈ విధమైన ప్రవర్తన కొనసాగడం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నానని, ప్రాణహానీ భయం కూడా ఏర్పడిందని వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. తనకు ఏదైనా అనుకోని ఘటన జరిగితే దానికి పూర్తిగా శ్రీనివాస్‌దే బాధ్యత అని ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించి తనకు న్యాయం చేయాలని, వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై తక్షణ చర్యలు తీసుకోవాలని బాధితుడు ఎస్సీ–ఎస్టీ లైజనింగ్ అధికారులను కోరినట్టు తెలిసింది. గిరిజన, వికలాంగ ఉద్యోగిపై ఈ తరహా ఘటన జరగడం సింగరేణిలో సామాజిక అసమానతలపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఉద్యోగ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ ఘటనపై సింగరేణి యాజమాన్యం, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

# నిరుపేదల వైద్య ఖర్చులకు జనహిత ఫౌండేషన్ చేయూత






**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 10, ప్రజా జ్యోతి:** నిరుపేదలకు ఎలాంటి సహాయం కావాలన్నా మేమున్నామంటూ మరోసారి జనహత ఫౌండేషన్ ముందుకొచ్చింది, జనహిత సేవ కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వరావుపేట మండలం, నందిపాడు గ్రామంలో నాలుగేళ్ల చిన్నారి వేడినీళ్లలో పడటంతో ఒళ్లంతా గాయాలయ్యాయి, పాప తండ్రి దేరంగుల ప్రసాదు రోజువారి వ్యవసాయ కూలీ పని చేసుకుంటూ పాపని కొత్తగూడెం హాస్పటల్లో చూపించగా వారు వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ కి రిఫర్ చేశారు, రోజు రోజుకి పాప ఆరోగ్య ఖర్చులు పెరగడంతో వారికి ఎంతో భారంగా మారింది, ఈ విషయం తెలుసుకొని మానవత్వంతో చలించిన జనహిత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బేర శ్రీ లక్ష్మి దాతల సహాయంతో వారికి 5000 వేల రూపాయలను శనివారం ఆర్థిక సహాయం గా అందజేశారు, ఈ సందర్భంగా శ్రీ లక్ష్మి మాట్లాడుతూ మానవత్వంతో చలించి సహృదయంతో ముందుకు వచ్చిన దాతలు అందరికీ, పలువురు పట్టణ ప్రముఖులు వారికి అభినందనలు తెలిపారు.

# ధనుర్మాస ఉత్సవాల భాగంగా ఆదివారం శ్రీ గోదాదేవి అమ్మవారి కూడారై ఉత్సవం

- అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తి వైభవం



**అన్నపురెడ్డిపల్లి, జనవరి 12, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం గం.10.00లకు శ్రీ గోదాదేవి అమ్మవారి కూడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 108 గంగళములతో పాయసం నివేదనను అమ్మవారికి సమర్పించనున్నారు. ధనుర్మాసంలో కూడారై ఉత్సవానికి విశేష ప్రాధాన్యం ఉండటంతో ఆలయం భక్తులతో కిటకిటలాడనుంది. శ్రీ గోదాదేవి అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు సుఖశాంతులు, ఐశ్వర్యం కలుగుతాయని ఆలయ పురోహితులు తెలిపారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ధనుర్మాస ఉత్సవాల ద్వారా అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఆధ్యాత్మిక కేంద్రముగా మరింత ఖ్యాతిని సంపాదించుకుంటున్నదని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

# కేటీఆర్, హరీష్‌రావులను కలిసిన భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు

- రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణల భేటీ



**భద్రాచలం, జనవరి 10, ప్రజాజ్యోతి :** భద్రాచలం నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణలు శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కేటీఆర్), మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. భద్రాచలం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ స్థానాల వివరాలతో పాటు, అక్కడి స్థానిక రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులతో కలిసి మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జరిగిన సమావేశంలో పాల్గొని పలు అంశాలపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

# ఆదివాసీలకు నిత్యవసరాల పంపిణీ

- సేవే మా మార్గం-నారీ శక్తి సేవా సంఘం అధ్యక్షురాలు పద్మ



**చర్ల, జనవరి 10 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం తెలంగాణ ఛత్తీస్గడ్ సరిహద్దు గ్రామమైన రామచంద్రపురం గ్రామంలో ఆదివాసీలకు కొత్తగూడెం నారీ శక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో 20వేల రూపాయల విలువైన నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవ చేయడమే తమ మార్గమని కొత్తగూడెం నారీ శక్తి సేవా సంఘం అధ్యక్షురాలు పద్మ పేర్కొన్నారు. జిల్లాలో తమ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. జీవితంలో సేవ చేయడం ద్వారానే సార్ధకత చేకూరుతుందన్నారు. తమ సం ఘంలో 600 ల మంది మహిళలే గ్రూపుగా ఏర్పడి సమాజ సేవ కోసం పునరంకితంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో వికాస తరంగిణి అధ్యక్షులు గుంజి పురుషోత్తం, లత ,మంజు, మాధవి, మడకం చందు, ప్రశాంత్, మణికంఠ, లవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేష్



**పాల్వంచ ,కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 10, ప్రజా జ్యోతి:** సంక్రాంతి పండు గ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు ఇళ్లను ఖాళీగా వదిలి వెళ్లే సమయంలో దొంగతనాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పాల్వంచ రూరల్ ఎస్సై బి. సురేష్ పలు సూచనలు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, నగదు, బంగారం తదితర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచుకోవాలని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా చలనం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ఆస్తి భద్రత కోసం పాల్వంచ రూరల్ పోలీసులు పండుగ సీజన్‌లో నిరంతర గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేరాలు జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా, నేరాలను ముందుగానే నివారించడం కూడా పోలీసుల బాధ్యతేనని, ఇందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజలు సహకరిస్తే దొంగతనాలను పూర్తిగా అరికట్టవచ్చని అన్నారు , అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. పండుగ సీజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ఇళ్ల భద్రతకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని అన్నారు.

# మెగా రక్తదాన శిబిరం




**చర్ల, జనవరి 10(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం చర్ల రైతు వేదికలో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ,మీకోసం మేమున్నాం సంస్థనితికి ఫౌండేషన్,లైన్స్ క్లబ్ ఆఫ్ చర్ల హెల్పింగ్ హ్యాండ్స్, చర్ల యూత్ సంస్థల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించుచున్నారు. ఈ సందర్భగా నిర్వాహకులు మాటడుతూ స్వామి వివేకానంద జయం తి సందర్భంగా, చర్ల మండలంలో మహత్కార్యానికి శ్రీకారం చుట్టాము అని రక్తలేమితో ఇబ్బంది పడుతున్న గర్భిణీ స్త్రీలు , తలసేమియా వ్యాధితో పోరాడుతున్న చిన్నారుల ప్రాణాలు కాపాడడమే లక్ష్యంగా ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నాము అని నేటికీ సరైన సమయంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు అని అటువంటి విషాదకర పరిస్థితులు ఉండకూడదనే సంకల్పంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నాము అని చర్ల మండలంలో 18 ఏళ్లు నిండిన విద్యార్థులు, యువకులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కదిలి రావాలి అని అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి, ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవండి అని అన్నారు .మీ పేరును ముందుగానే నమోదు చేసుకోవడానికి లేదా వివరాల కోసం సంప్రదించండి అని నీలి ప్రకాష్: 9618170754, నిఖిల్: 9494964514, కిరణ్: 7337243423, కొప్పుల మురళి: 7075822801, అని అన్నారు.

## ప్రజాజ్యోతి వార్తకు స్పందన

- స్పీడ్ బ్రేకర్ పనులు ప్రారంభించిన ఆర్టీసీ


ప్రజాజ్యోతి
07 Jan 2026 - Page 6
అధ్వానంగా కొత్తగూడెం బస్సు షెల్టర్



**కొత్తగూడెం జనవరి 10(ప్రజాజ్యోతి):** ఈనెల 6వ తేదీన ప్రచురించిన "అధ్వానంగా కొత్తగూడెం బస్ షెల్టర్ "అనే వార్తకు ఆర్టీసీ అధికారులు స్పందించి ఎంట్రన్స్ లోని స్పీడ్ బ్రేకర్ పనిని మొదలుపెట్టారు. షెల్టర్ పనిక కూడా కొత్తగూడెం ఆర్టిసి అధికారులు పరిశీలించారు. వార్త కథననికి అధికారుల స్పందన పై పలువురు ప్రజా జ్యోతిని అభినందించారు.మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు తొలగించడం బిజెపికి తగదు

## నాడు గాంధీ పేరు వింటేనే బ్రిటిష్ వాళ్ళు భయపడ్డారు

- నేడు రాహుల్, సోనియా గాంధీ పేరు వింటే బిజెపి వాళ్లు భయపడుతున్నారు
- ఉపాధి హామీ పథకం పేరు తొలగింపు పై ఈనెల 20 నుండి 30 వరకు నిరసన కార్యక్రమాలు
- విలేకరుల సమావేశంలో కొత్తగూడెం జిల్లా డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న



**కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 10, ప్రజా జ్యోతి:** ప్రపంచ దేశానికే విధాత అయిన జాతిపిత మహాత్మాగాంధీ పేరు పై ఉన్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును బిజెపి ప్రభుత్వం తొలగించడాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తీవ్రంగా ఖండించారు, శనివారం పట్టణంలోని వజ్ర హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీని అన్ని దేశాలలో దేవుడిగా పూజిస్తారని, గాంధీ పేరు వింటేనే ఆనాడు బ్రిటిష్ వాళ్ళు కూడా భయపడే వారిని, నేడు రాహుల్, సోనియా గాంధీ అంటే బిజెపి వాళ్లు భయపడుతున్నారని అన్నారు, బిజెపి ప్రభుత్వం గాంధీ పేరును కనుమరుగు చేయాలనే ఉద్దేశంతోనే దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఆధారపడి పనిచేస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ను లేకుండా చేసి జిరాంజీ అనే పేరును ముందుకు తీసుకొచ్చి బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు, దేశంలో మహిళలు ఎక్కువగా ఈ పథకం పై పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఆనాడు మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రవేశ పెట్టగా నేడు ఎంతో మందికి ఉపయోగపడే ఉపాధి హామీ పథకాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ ఈనెల 20 నుండి 30వ తేదీ వరకు ఏఐసీసీ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు, నిరసన కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ పీసీసీ పిలుపుమేరకు మండ్రేగా బచావ్ సంగ్రామ్ పేరుతో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఒకరోజు నిరాహార దీక్ష, ర్యాలీలు చేయడంతో పాటు అనేక వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు, ఉపాధి హామీ పథకం గురించి అన్ని గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ద్వారా గెలిచిన సర్పంచులు, వార్డ్ మెంబర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, అన్ని వర్గాల ప్రజలకు తెలియజేయడంతో పాటు ఈ పథకాన్ని తొలగించిన బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరించాలని కోరారు, ఉపాధి హామీ కూలీలు కలిసి వ్యతిరేకిస్తూ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు, ఈ విలేకరుల సమావేశంలో పిసిసి రాష్ట్ర నాయకులు నాగ సీతారాములు, మాజీ డిసిసిబి చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఊకంటి గోపాలరావు, తుళ్లూరి బ్రహ్మయ్య, ఎర్రంశెట్టి ముత్తయ్య, పాల్వంచ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల రంగారావు ,సాధం రామకృష్ణ, కొండం వెంకన్న మహిపతి రామలింగం, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, వై వెంకటేశ్వర్లు, కాల్వ భాస్కర్ ,పైడిపల్లి మహేష్, కాపర్తి వెంకటాచారి వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సర్పంచులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఆయిల్ నిక్షేపాల కోసమే వెనుజులా పై దాడి

- ఆరు హామీలు, 420 వాగ్దాలను అమలుచేయని రేవంత్ సర్కార్
- తెలంగాణ రాష్ట్రం బకాయిల కుప్ప
- ఓటర్లును తొలగించి బిజెపి గెలవాలని చూస్తోంది
- విలేకరుల సమావేశంలో(సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు




**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్ , జనవరి 10, ప్రజా జ్యోతి**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెనిజులాలో ఉన్న నాణ్యమైన ఆయిల సంపదను దోపిడీ చేసే లక్ష్యంతోనే ఆ దేశ అధ్యక్షుడు పై దుర్మార్గమైన దాడి చేసి ఎత్తుకొచ్చారని, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు భిన్నంగా వెనుజుల దేశ సార్వభౌమాధికారాన్ని కాలారాఛే విధంగా దాడికి పాల్పడటం, హేయమైన చర్యని సిపిఐ( ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు శనివారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ వెనిజులా డ్రగ్ సరఫరా చేస్తుంద నే సాకుతో ఆ దేశం పై దాడి చేశామని చెప్పటం ట్రంప్ టక్కరితనమని, ప్రపంచంలో ఎక్కడా దొరకని నాణ్యమైన ఆయిల్ వెనిజులాలో ఉందని దానిపై కన్నేసిన ట్రంప్ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు రంగారావు విమర్శించారు. అమెరికా చరిత్ర అంతా ఇలా దేశాల సార్వమాధికారాన్ని ధ్వంసం చేయటమేనని ఆయన విమర్శించారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తే భారత్ ఇంతవరకు ఈ విషయంపై స్పందించకపోవడం విచారకరమని అన్నారు. మోడీ కూడా ట్రంపును సంతోష పెట్టలేదని పరోక్ష బెదిరింపులకు గురి చేయటం, దీని పై భారత్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలను 420 వాగ్దానంలు చేసి అధికారంలోకి వచ్చిందని. హామీలను అమలు చేస్తామని చెప్పి ఆర్భాటంగా ప్రకటించి రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ నేటికీ ఆరు గ్యారెంటీల్ని పూర్తి స్థాయిలో ప్రజలకు అందించలేదని ,420 వాగ్దానాలని గంగలో కలిపారని ఆయన విమర్శించారు. పెన్షన్లు,ఫీజు రియంబర్స్మెంట్లో, ఆరోగ్యశ్రీ బిల్లులు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ని అందించకుండా ఆ ఉద్యోగాల్ని హింస పెట్టడం ఎలా సరైనదని ఆయన ప్రశ్నించారు. రైతాంగానికి కావాల్సిన యూరియా కొరత కేంద్రం సృష్టిస్తే కేంద్రంపై పోరాడి సరిపడా యూరియాను తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో యువత మహిళలు రైతులు కార్మికులు అందరూ సమస్యలతో ఎదుర్కొంటుంటే ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టకపోవడం శోచనీయమన్నారు, అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేజీ రామచంద్రన్, కే రంగయ్యలు మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం మతాలను కులాలను రెచ్చగొడుతుందని, పౌరసత్వం పేరు మీద మైనారిటీలను బెదిరింపులు చేస్తుందని వారు అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేయాలని కార్మికులు ఉద్యమిస్తున్న నూతన రైతు చట్టాలను ఎత్తివేయాలని రైతాంగ ఉద్యమిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వారు అన్నారు ఎంజీఎన్ఆర్ రద్దుచేసి జి.రాంజీ చట్టం తేవటం ఉపాధి హామీ చట్టం లేకుండా చేయటమేనని వారు అన్నారు. ప్రభుత్వం దుమ్ముగూడెం నుండి నీటిని కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి మొత్తానికి ఇవ్వాలని, ఇల్లందు నియోజక వర్గానికి కూడా దుమ్ముగూడెం నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు పార్టీ సిద్ధం అవుతున్నట్లు, ఈ సందర్భంగా తెలిపారు ,ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య ,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోకినపల్లి వెంకటేశ్వర్లు, చంద్రఅరుణ, చిన్న, చంద్రన్న ,ముద్ద బిక్షం కల్పన , రాము, నాయని రాజు, జాటోత్ కృష్ణ, ధర్మ, భాస్కర్, కిషోర్ ,గోనెల రమేష్, రాయబారం వెంకటేశ్వర్లు ,వేల్పుల రమేష్ ,కల్లూరి పద్మ తదితరులు పాల్గొన్నారు

## క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన బోడ పుణ్య నాయక్



**టేకులపల్లి,జనవరి10,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బద్దుతండ గ్రామ పంచాయతీలో బద్దు తండా యూత్ ఆధ్వర్యంలో ఐదు పంచాయతీల క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్ కు ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా నాయకులు బోడ పుణ్య నాయక్, బద్దు తండ సర్పంచ్ నరేష్ పాల్గొని, పూజా కార్యక్రమాలు నిర్వహించి, టాస్ వేసి క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించారు.ఈ సందర్భంగా పుణ్య నాయక్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్ కై ఏర్పాటు చేసుకున్న గ్రౌండ్ ఎంతో విశాలంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటం తననెంతగానో ఆకర్షించిందని, ఇలాంటి టోర్నమెంట్స్ జరుపుకోవడం వల్ల వ్యక్తులకి, ప్రాంతాలకి మధ్య తారతామ్య భేదాలు తొలగుతాయని, నిత్య జీవితంలో కూడా ఆటలు ఆడేవారుఎంతో ఉల్లాసంగానూ,సంతోషంగానూ ఉంటారని తెలియజేశారు. బద్దుతండా, కుంటల్లా, పెట్రాం చెలక,ఎర్రాయిగూడెం, మొక్కంపాడు గ్రామ పంచాయతీ ల నుండి వచ్చిన యువకులందరూ ఆటలతో పాటు భవిష్యత్తుమీద కూడా దృష్టి పెట్టి మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అదేవిధంగా బద్దుతండా సర్పంచ్ బానోత్ నరేష్ నాయక్ మాట్లాడుతూ యువకులందరూ సంయమనంతో,సోదర భావంతో,ఉత్సాహంగా తమ తమ ప్రతిభను మెరుగు పరుచుకునే విధంగా మెసలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఊకే రామకృష్ణ,ఉపసర్పంచ్ భూక్య కాంతారావు, భూక్య నైజాం, పటేల్,పి. జబ్బార్ లాల్, వార్డ్ మెంబర్ ఈసం ప్రసాద్, బి.అమర్సింగ్, బానోత్ భాస్కర్, నాయకులు రవి రాథోడ్, సేవాలాల్ సేన రాష్ట్ర రైతూ సంఘం ప్రధాన కార్యదర్శి ధారావత్ కృష్ణనాయక్,బి.నాని బాబు, బి బావుసింగ్, బి. రవి, జె.పూల్ సింగ్, బి. శ్రావణ్, సునావత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల మూసివేతకు కుట్ర




**కొత్తగూడెం, జనవరి 10 ( ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కుట్ర పన్నుతున్నదని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక సిద్ధార్థ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ అధ్యక్షతన జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ కౌన్సిల్ సమావేశమునకు ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగానికి నిధుల కేటాయింపులో కోత పెడుతూ,ఉపాధ్యాయుల ఖాళీ పోస్టుల ను నింపకుండా,పాఠశాలల భౌతిక పరిస్థితులు మెరుగుపరచకుండా,ప్రభుత్వ విద్యను ప్రభుత్వం ప్రజలకు దూరం చేస్తున్నదని అన్నారు.కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా వికసిత్ భారత్ శిక్షా అధస్టాన్ 2025 బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టిందని,సిలబస్లో మతాన్ని చొప్పించి విద్యను కాషాయీకరణ చేయుటకు పూనుకున్నదని,దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దేశంలో విద్యను ప్రైవేటు శక్తులకు అప్పగిస్తూ,బడుగు బలహీనవర్గాలకు విద్యను అందకుండా చేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని,అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను సాధించు కోవాలని కోరినారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.అశోక్ కుమార్,రాష్ట్ర కార్యదర్శి ఎం.సోమయ్య,రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రవిచంద్ర,కార్యవర్గ సభ్యులు వి.మనోహర్ రాజు,టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరాంబాబు,పివైఎల్ జిల్లా అధ్యక్షులు పి.మంగయ్య,పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎం.శివ ప్రశాంత్, డి.ప్రణయ్ కుమార్,టీపీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.ప్రశాంత్ తదితరులు ప్రసంగించారు.అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎం.రామాచారి,అధ్యక్షులుగా జి.హరిలాల్,అసోసియేట్ అధ్యక్షులుగా డి.శ్రీనివాస్,ఉపాధ్యక్షులుగా పహీంబాయ్,పి.మంగయ్య, పి.రవి,ఎం.అంతోని,పి.సత్యనారాయణ,ఎండి.మౌలానా,సిహెచ్.వెంకన్న,ప్రధాన కార్యదర్శిగా వి.వినోదిని, అసోసియేట్ ప్రధాన కార్యదర్శిగా బి.బ్రహ్మాచారి, కార్యదర్శులుగా ఎం.శివ ప్రశాంత్,డి.ప్రణయ్ కుమార్,సిహెచ్.రమేష్,కె.వెంకటేశ్వర్లు,పి.నాగభూషణం ఎన్నికయ్యారు.